

# వైద్యులకు సమయపాలన ముఖ్యం

## పద్మశ్రీ డాక్టర్ కాకర్ల సుబ్బారావు



సభలో ప్రసంగిస్తున్న డాక్టర్ కాకర్ల సుబ్బారావు

**గ్రామీణ మంగళగిరి, న్యూస్‌టుడే:** 'వైద్యులకు సమయపాలన చాలా ముఖ్యం. ప్రతి నిమిషం, ప్రతి క్షణం రోగి ప్రాణాలు కాపాడేందుకు ఎంతో విలువైనవ'ని నిమ్స్ వ్యవస్థాపక డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ కాకర్ల సుబ్బారావు పట్టభద్రులైన వైద్యులను ఉద్దేశించి అన్నారు. మండలంలోని చినకాకాని ఎన్నారై వైద్యకళాశాలలో ఎంబీబీఎస్ పూర్తిచేసిన 2003 బ్యాచ్ వైద్య విద్యార్థులకు డిగ్రీ పట్టాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ఎన్నారై అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ముక్కామల అప్పారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి డాక్టర్ కాకర్ల ప్రసంగిస్తూ ఇప్పటివరకూ నాలుగు గోడల మధ్య విద్యనభ్యసించి.. విశాల ప్రపంచంలోకి అడుగుపెడుతున్న నూతన వైద్యులు అంకిత భావంతో రోగులకు సేవలందించాలన్నారు. ముఖ్యంగా రెండు విషయాలను వైద్యులు గుర్తుంచుకోవాలన్నారు. ఒకటి సమయపాలన, రెండోది కమ్యూనికేషన్ స్కిల్స్ అన్నారు. రోగాన్ని గుర్తించడం ఒక భాగమైతే, బాధితులకు వివరించడం, అందించబోయే వైద్యాన్ని గురించి అర్థమయ్యేలా చెప్పడం కూడా చాలా ముఖ్యమేనన్నారు. వైద్యవృత్తిలో అంకిత భావంతో, నిజాయతీగా పనిచేయాలని సూచించారు. ముఖ్యంగా చాలా గ్రామీణ ప్రాంతాల్లో తాగు నీరు, పారిశుద్ధ్యం సరిగా లేక ప్రజలు జబ్బుల పాలవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. సమాచారం వేగవంతమైందని, ప్రతీ కుగ్రామంలో సెల్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చాయని, కానీ అన్ని రోగాలకు వైద్యం అందుబాటులోకి రాలేదన్నారు. ఇప్పటికీ ప్రతీ మూడు సెకండ్లకు ఒక శిశువు, ప్రతీ 5 నిమిషాలకు ఒక బాలింత మృతి చెందుతున్నట్లు గణాంకాలు చెపుతున్నాయన్నారు. ఈ పరిస్థితుల్లో మార్పులు రావాలంటే అన్ని ప్రాంతాల్లో వైద్య సదుపాయాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందని డాక్టర్ కాకర్ల అభిప్రాయపడ్డారు. డబ్బుపోతే నష్టం కాదని, ఆరోగ్యం పోతే కొంత నష్టమని, కానీ క్యారెక్టర్ పోతే అన్నీ పోయినట్లేనన్న మహాత్ముని బోధనలు నిత్యం గుర్తుపెట్టుకోవాలని సూచించారు. మరో అతిథి అమెరికన్ వైద్య సంఘం కార్యనిర్వాహక ఉపాధ్యక్షుడు, సీఈవో డాక్టర్ మైఖెల్ డి మేవ్స్ మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనదని చెప్పారు. దీనిలో మార్పులు నిరంతరమన్నారు. వీటిని అందిపుచ్చుకుని సమాజానికి, జాతికి సేవలందించాలని సూచించారు. ప్రతీ రోగీ వైద్యునికి ఎంతో ముఖ్యమైన వ్యక్తని, అతన్ని నిర్లక్ష్యం చేయవద్దని మహాత్మాగాంధీ పేర్కొన్నారని చెప్పారు. మహాత్ముని జీవితం అందరికీ ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. వైద్యుల బాధ్యతాయుత నిర్ణయాలు రోగులకు మేలుచేసే విధంగా ఉండాలని సూచించారు. అమెరికాలోని సెయింట్ జోసెఫ్స్ రీజినల్ మెడికల్ సెంటర్ అధ్యక్షుడు డాక్టర్ విలియమ్ మెక్‌డొనాల్డ్, సెయింట్ జోసెఫ్స్ హెల్త్‌కేర్ సిస్టమ్స్ సీఎఫ్‌వో జాక్ రాబిన్ సన్, ఎన్నారై అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ అక్కినేని సుదర్శనరావు, కార్యదర్శి డాక్టర్ మంతెన నరసరాజు, కోశాధికారి డాక్టర్ నిమ్మగడ్డ ఉపేంద్రనాథ్, డైరక్టర్లు డాక్టర్ ఆవుల సురేంద్ర, డాక్టర్ బిక్కిన సాయి రమేష్, డాక్టర్ బిక్కిన సాయిమహేష్, డాక్టర్ కత్నేని జితేంద్ర, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.వి.ఎస్. చౌదరి, ఎన్నారై జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.బుచ్చిబాబు ప్రసంగించారు. తొలుత డాక్టర్ ముక్కామల అప్పారావు శ్లోకాలను వివరిస్తూ వైద్యులు తమ వృత్తిలో ఎలా మెలగాలన్న అంశాలను విపులీకరించారు. ఎన్నారై అకాడమీ రూపొందించిన 'స్మృతి' అనే పుస్తకాన్ని డాక్టర్ కాకర్ల సుబ్బారావు ఆవిష్కరించారు. 2008-09 'సావనీర్'ను డాక్టర్ మైకెల్ డి మేవ్స్ ఆవిష్కరించారు. అనంతరం వైద్య విద్యార్థినీ విద్యార్థులకు డిగ్రీ సర్టిఫికేట్లను అతిథులు అందజేశారు. విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



విద్యార్థినికి వైద్య పట్టా అందజేస్తున్న డాక్టర్ కాకర్ల,



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ మైఖెల్ డి మేవ్స్,



హాజరైన విద్యార్థుల తల్లిదండ్రులు, బంధువులు

# మానవత్వంతో పరిమళించండి: కాకర్ల



ప్రసంగిస్తున్న నిమ్స్ మాజీ డైరెక్టర్ డాక్టర్ కాకర్ల సుబ్బారావు

మంగళగిరి, న్యూస్‌లైన్: సమాజానికి సేవ చేసే అరుదైన అవకాశం వైద్యులకు మాత్రమే దక్కుతుందని నిమ్స్ మాజీ డైరెక్టర్ పద్మశ్రీ డాక్టర్ కాకర్ల సుబ్బారావు పేర్కొన్నారు. చిన కాకాని ఎన్నారై మెడికల్ కాలేజీలో శనివారం రాత్రి నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాకర్ల మాట్లాడుతూ నిబద్ధతతో, నైతిక విలువలు కలిగి మానవత్వం పరిమళించేలా సేవలందించాలని డాక్టర్లకు సూచించారు. రోగికి సేవలందించే విషయంలో వ్యాపార దృక్పథం తగదన్నారు. సభకు డాక్టర్ ముక్కామల అప్పారావు అధ్యక్షత వహించారు. వేదికపై ఎన్నారై మెడికల్ కాలేజీకి చెందిన 2003 ప్రథమ సంవత్సర బ్యాచ్‌కు చెందిన 78 మందికి పట్టాలను అందజేశారు.

**ఆరోగ్యశ్రీ భేష్..!:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రాజీవ్ ఆరోగ్యశ్రీ, 104,108 వైద్య సహాయాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని డాక్టర్ కాకర్ల కితాబిచ్చారు. సభలో అమెరికన్ మెడికల్ అసోసియేషన్ సీఈఓ డాక్టర్ మైఖేల్ డోవెల్స్, డాక్టర్ జాక్ రాబిన్‌సన్, ఎన్నారై అకాడమీ ఆఫ్ సైన్సెస్ ప్రతినిధులు నర్సరాజు మంతెన, సుదర్శనరావు అక్కినేని, జితేంద్ర నిమ్మగడ్డ, ఎన్‌వీఎస్ చౌదరి పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న అమెరికన్ మెడికల్ అసోసియేషన్ సీఈఓ డాక్టర్ మైఖేల్ డోవెల్స్